శ్రీ రమణ జ్యోతి
సెప్టెంబర్ 2017
ఈ సంచికలో ...

Sri Ramana Jyothi
September 2017
IN THIS ISSUE ...

| | | | |
|---|---|---|---|
| 1. | డా॥ కే.ఎస్. గారి 42వ ప్రవచనము | డా॥ వి. రామదాస్ మూర్తి | 3 |
| 2. | ప్రపత్త్యష్టకము | జగదీశ శాస్త్రి | 7 |
| 3. | భగవాన్ ఉపదేశసారము | పింగళి సూర్యసుందరం | 9 |
| 4. | ఆత్మవిచారణకు ఒక సుగమ మార్గము | నండూరి రామమోహన్ | 12 |
| 5. | శ్రీ భగవాన్ పాద సన్నిధిలో | జి. శ్రీహరిరావు | 17 |
| 6. | సిద్ధులు, వారి 'సిద్ధు'లు | డా॥ వి. రామదాస్ మూర్తి | 23 |
| 7. | Sri Krishna-avatar | Dr. K. Subrahmanian | 26 |
| 8. | "Did You Not Ask Me to Come?" | V. Krithivasan | 30 |
| 9. | Isaniya Desikar | David Godman | 36 |
| 10. | Whose Plan is Better? | | 40 |
| 11. | To Beloved Bhagavan, the Lord of Love | | 43 |

శ్రీ రమణజ్యోతి వ్యవస్థాపకులు : కీ॥శే॥ డా॥ కె. సుబ్రహ్మణియన్
(వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీరమణకేంద్రం)

**Editorial Board:** Telugu: **Dr. V. Ramadas Murthy, Malladi Phanimala, Katravulapalli Subbalakshmi**
English: **V. Krithivasan, N.S. Ramamohan, Sneha Choudhury**

# నమ్రత

ఆంగ్ల మూలం: డా॥ కే.యస్. గారి 42వ ప్రవచనము

తెలుగు అనువాదం: డా॥ వి. రామదాస్ మూర్తి

## వినయం వివేకానికి మూలం

ఆదిశంకరులు రచించిన "షట్పదీ స్తోత్రం"లో మొదటి శ్లోకం ఇలా సాగుతుంది. అవినయ మపనయ విష్ణో దమయ మనః శమయ విషయ మృగతృష్ణాః। భూతదయాం విస్తారయ। తారయ సంసార సాగరతః॥ మనం ఏమని ప్రార్థించాలో ఇందులో చెప్పబడి వుంది. ఓ ప్రభూ! మొట్ట మొదట నాకు గర్వం లేకుండ చేయి. వినయం అంటే నమ్రత. అవినయం అంటే గర్వం. సాధకుని మొట్ట మొదటి లక్షణం గర్వం లేకుండ వుండడం. ఆధ్యాత్మికత, గర్వం, ఒక చోట వుండడం కుదరదు.

మన సాధారణ సంభాషణలలో కూడ ఆలోచించి పదాలను వాడాలి. తరచు, బాబా, మహర్షి, శ్రీ ఆరోబిందో అలాంటి గొప్పవారికి మనం భక్తులమని చెబుతుంటాం. నిజమైన భక్తుడు తాను భక్తుడినని ఎప్పుడూ చెప్పుకోడు. ఇతరులు అలా అంటే అది వేరే. ఏ అనుమానం లేకుండ చెప్పదగినది ఒక్కటే, మనం మన భక్తులం. బాహ్యంగా భక్తిని ప్రదర్శించాలంటే, పూజ, ఆరాధన, దేవాలయాలను సందర్శించడం మొదలైనవి వున్నాయి. వీటన్నింటిలో కూడ ఒక రూపాన్ని తలచుకొనడం, ఆరాధించడం జరుగుతుంది. అప్పుడప్పుడు విగ్రహారాధన మంచిది కాదంటాం. కాని ప్రతిరోజు మనల్ని, అంటే మన శరీరాన్ని ఆరాధిస్తాం. శరీరాన్ని శుభ్రంగా పెట్టుకునేందుకు రోజూ ప్రయత్నం చేస్తాం. మరి మనసు మాటేమిటి? మనసును శుద్ధంగా వుంచుకోవడం, ఆ మాటకొస్తే, మనసునే నశింప జేయడం ధ్యేయంగా పెట్టుకున్న వాళ్ళు శరీర శుభ్రతను గురించి పట్టించుకోరు.

వినయం వివేకానికి మొదటిమెట్టు. నాకు ఏమీ తెలియదని చెప్పడమే వివేకపథంలో నడవడానికి ప్రయత్నిస్తున్న చిహ్నం. నాకు మహాభారతం, భగవద్గీత అలాంటివన్నీ తెలుసునని ప్రకటిస్తే, అది బుద్ధికి సంబంధించినది అవుతుంది గాని అనుభవం మీద ఆధారపడి చెప్పినది కాదు. లడ్డు ఎలా చేయాలో చదివి తెలుసుకున్నంత మాత్రాన దానిని చేసినట్లు కాదు. వేదాంతం సంగతి కూడా అంతే. వేదాంతం చదువుకున్నది అంతా అలా వంటకం ఎలా చేయాలో చదవడం వంటిదే. అది అనుభవం లోనికి రానిది. పరిమితమైన నా మనసు కారణంగా నాకు ఒక విషయం తెలియదు అని చెప్పడమే వివేకం. ఈ ప్రపంచంలో ఏదైనా విషయ విజ్ఞానాన్ని తెలుసుకొనాలంటే దానిని ఆచరించి చూపడం వల్లనే సాధ్యమౌతుంది. మనసును మనకు మాత్రం పరిమితం చేయకుండ, బాహ్యంగా ఒక ప్రత్యేక విషయంపైన కేంద్రీకరింపజేస్తే, మనసు అతి చురుకుగా ఆ విషయ పరిజ్ఞానాన్ని పొందగలుగుతుంది. భౌతిక శాస్త్రజ్ఞులం కావాలనుకుంటే దానిని గురించి పరిశ్రమ చేసి కొంత కాలం తరువాత అందులో ప్రావీణ్యత సంపాదించి విశేషజ్ఞులమని చెప్పుకోవచ్చు.

**అతి సూక్ష్మం, అతి ఘనం**

ఒక విషయం గురించి బాగా తెలుసుకున్నప్పటికి, దానిని గురించి మనకు అంతా తెలుసుననుకోవడం అజ్ఞానం. వివిధ విజ్ఞాన శాస్త్రాలు రోజురోజుకు విస్తృతమౌతుంటాయి. మనం ఎంతో విలువైనదనుకునే వైజ్ఞానిక సమాచారం కొంత కాలానికే పాతబడిపోతుంది. ఒకప్పుడు పుస్తకాలలో పరమాణువు అతి చిన్నదనీ, దానిని అంతకంటే చిన్నదిగా విడగొట్టలేమని వ్రాసి వుండేది. కాని 'ఆటంబాంబ్'ను రూపొందించడంతో  పరమాణువును చీల్చి ఎంతో శక్తిని విడుదల చేయగలమని నిరూపణ చేయలేదా? హిరోషిమా, నాగసాకీ నగరాలపై వేసిన

అణుబాంబ్ పరమ విధ్వంసాన్ని సృష్టించింది. దానిని జపాన్ పై పడవేసిన ఇంగ్లీష్ పైలట్ లియోనార్డ్ ఛెషైర్, అమెరికాకు చెందిన ఓసాన్ హైమా జీవితాంతం ఆ జరిగిన విధ్వంసానికి పశ్చాత్తాపపడ్డారు. హైమా భారతీయ తత్వశాస్త్ర అధ్యయనం చేసిన వాడు కూడ. బాంబ్ పేలుడు విధ్వంసాన్ని చూసి భగవద్గీతలో కృష్ణుడు "నేనే అగ్ని, నేనే విధ్వంసకారుడిని" అని అన్న మాటలను జ్ఞప్తికి తెచ్చుకున్నాడు. ఉపనిషత్తులు ఎప్పుడో తెలిపాయి. "భగవంతుడు అతి సూక్ష్మ అణువు కంటే సూక్ష్మమైనవాడు, అతి పెద్దదానికంటే పెద్దవాడు" అని.

**ప్రతి ఒక్కరూ ఒక విశిష్ఠ వ్యక్తియే**

మామూలుగా మనకు ఎంతో తెలుసుననుకుంటాము. కాని మనకు తెలిసినది ఎంత? చాలా స్వల్పం, ఏమీ తెలియనట్లే. ఏదో తెలుసునని గర్వాన్ని ప్రదర్శించరాదు. మనకంటే ఎంతో తెలిసిన వాళ్ళు మరింకెంత మందో వుంటారు. నాకు తెలుసు అని ఎవరితోనైన అంటే, అతనికి తెలియనిది నాకు తెలుసునని చెప్పినట్లవుతుంది. ప్రతి ఒక్కరికి కొంత విషయ జ్ఞానం వుండి తీరుతుంది. నీలో ఒక నైపుణ్యం వుంటే ఇతరులలో ఇతర నైపుణ్యాలు వుండవచ్చు. ఒక వైద్యుడు హృదయ చికిత్సా విషయజ్ఞుడైతే ఇంకొకరికి శరీరంలోని మరొక భాగం లేదా అంగం యొక్క చికిత్సను గురించిన ప్రత్యేక నైపుణ్యత వుంటుంది. అలాగే, చికిత్స మాటకొస్తే, ఒకే జబ్బుకు ఒకరికి పనిచేసిన మందు మరొకరికి పనిచేయకపోవచ్చు. శరీరతత్వాన్ని బట్టి శరీరంలో ప్రతికూల లక్షణాలు కనిపించవచ్చు. అసలు ప్రతి ఒక్కరూ ఒక విశిష్ఠ వ్యక్తియే. సాధనకు సంబంధించి ఈ విషయాన్ని గ్రహించడం ఎంతో అవసరం.

భగవాన్ మరణానుభవాన్ని పొందిన సంగతి మనకు తెలుసు. ఇరవై నిమిషాల పాటు సాగిన ఆ అనుభవంలో భగవాన్ దేహ స్పృహ పూర్తిగా కోల్పోయారు. వెంకట్రామన్‌గా అప్పటి వరకు చలామణీ అయిన ఆ

బాలుడు నామ, రూపాలు లేవన్న సత్యాన్ని తెలుసుకున్నాడు. అందుకే ఇంటినుండి తిరువణ్ణామలై బయలుదేరేటప్పుడు వ్రాసి వదలిన చీటిలో ''నేను'' అని మొదలుపెట్టి మధ్యలో తన శరీరాన్ని ''ఇది'' అని ''దీని'' కోసం వెదకడానికి ఖర్చుపెట్టడం వృథా అని తెలిపారు. చీటీలో ఆఖరుకు పేరు, సంతకం లేకుండ ఒక గీత పెట్టారు. వెంకట్రామన్ 'చిదానంద రూపుడు శివోహం' అయ్యారు. నీవు 'శివ'మైతే, అంతా 'శివ'మే, ఇక వేరుగా వుండడమన్నదెక్కడ?

ఆదిశంకరులంతటి వారు 'సౌందర్యలహరి'ని రచిస్తూ, ''ఓ మాతా! ఈ శ్లోకాలు నీవి, నీవే పదాలను ఇచ్చావు, నేను వ్రాస్తూ తిరిగి వాటిని నీకే ఇస్తున్నాను. నేను కాదు రచించినది, అంతా నీదే'' అని అన్నారు. సంక్రాంతి నాడు సూర్యునికి కర్పూర హారతిని ఇస్తాము. సూర్యుడెక్కడ, కర్పూరమెక్కడ? అర్థం లేనిదిగా అగుపడవచ్చు. కాని ఈ ప్రపంచంలో ప్రతి ఒక్కటి సూర్యుని ప్రకాశం, వేడి నుండి జనించినదే. హారతి అంటే సూర్యుని నుండి ఏర్పడిన దానిని సూర్యునికే ఇవ్వడమన్న మాట. నేను అదే చేస్తున్నానని శంకరులు అన్నారు. తర్పణం వదిలేటప్పుడు మనం నది నుండి నీళ్ళు తీసుకుని మళ్ళీ నదిలోనికే నీళ్ళను వదలుతాము. ఈ భావనకు యథార్థమైన నమ్రత కారణం. అది తెచ్చిపెట్టుకున్న నమ్రత కాదు.

అట్లాంటి నమ్రత, వినయాలను జ్ఞానులు, ఋషులు ప్రదర్శిస్తారు. వివేకం వున్న చోట వినయం వుంటుంది. విషయజ్ఞానం వున్నదనుకున్న చోట గర్వం వుంటుంది. వివేకము, గర్వము ఒక చోట వుండలేవు. మనకు అలాంటి నిర్మలమైన నమ్రత భగవంతుని కృప ద్వారా మాత్రమే సాధ్యమౌతుంది.

అరుణాచలశివ

# ప్రపత్త్యష్టకము

- శ్రీ జగదీశ శాస్త్రి కృతమ్

శ్రీ రమణభగవానుని ఆస్థాన సంస్కృత కవిగా ప్రసిద్ధుడైన శ్రీ జగదీశ శాస్త్రి ఒకప్పుడు వ్యాధిచే మృత్యుముఖమునపడనుండెను. అప్పుడాయన తన ప్రారబ్ధమును కూడ నిరోధించి తన్ను మృత్యు ముఖము నుండి తప్పింపవలయునని శ్రీరమణభగవానుని ప్రార్థించుచు ఈ అష్టకమును రచించెను. అట్లే ఆయన వెంటనే బ్రతికి ఆరోగ్యవంతుడయ్యెను.

భగవానుని ఆమోదముతో శ్రీ టి.కె. సుందరేశ అయ్యర్ దీనిని తమిళములోనికి అనువదించెను. తరువాత భగవానుడే స్వయముగా దీనిని తమిళ లిపిలో దేవరాజమొదలియారునకు వ్రాసి యిచ్చెను. ఆశ్రమమువారు ఈ యష్టకము యొక్క ప్రశస్తిని మౌంటెన్ పాత్ - త్రైమాస పత్రికలో ప్రకటించిరి.

శ్లో॥ ఆవర్తపుర్యాం జనితం ప్రపద్యే
పాండ్యేశ దేశే విహృతం ప్రపద్యే ।
శోణాచల ప్రస్థచరం ప్రపద్యే
భిక్షుం తపః క్లేశసహం ప్రపద్యే ॥ 1

శ్లో॥ ఆబ్రహ్మకీటాంతసమం ప్రపద్యే
జితారిషడ్వర్గ మహం ప్రపద్యే ।
సర్వజ్ఞతాసారభృతం ప్రపద్యే
నిస్సీమకారుణ్యనిధిం ప్రపద్యే ॥ 2

శ్లో॥ అస్మాత్ప్రపంచా దధికం ప్రపద్యే
విశ్వాధికోక్తేర్విషయం ప్రపద్యే ।
కాలగ్రహగ్రాహభయాపనుత్యై
కృతాంత శిక్షాకృతినం ప్రపద్యే ॥ 3

శ్లో॥ వినేరు మార్తిం విషయాధ్వజన్యాం

విజ్ఞానమూర్తిం దధతం ప్రపద్యే ।
కందర్పదర్ప జ్వరవారణాయ
కామారి లీలావతరం ప్రపద్యే ॥ 4

శ్లో॥ ఆజన్మవర్ణి ప్రతినం ప్రపద్యే
కుండీభృతం దండధరం ప్రపద్యే ।
బ్రహ్మాసనధ్యానరతం ప్రపద్యే
బ్రహ్మాత్మభూయం యతినం ప్రపద్యే ॥ 5

శ్లో॥ హరం ప్రపద్యే విజరం ప్రపద్యే
స్వతంత్రతాయా స్పదనం ప్రపద్యే ।
అమేయసామర్థ్యవహం ప్రపద్యే
విశుద్ధవిజ్ఞానివరం ప్రపద్యే ॥ 6

శ్లో॥ దౌర్భాగ్యతాపత్రయకర్మమోహ
సంతాపహంతార మహం ప్రపద్యే ।
యథార్థసంకల్ప మపేతపాప
మవాప్త కామం విశుచం ప్రపద్యే ॥ 7

శ్లో॥ మనః ప్రసాదం భజతాం దదానం
ముగ్ధస్మితోల్లాసిముఖం ప్రపద్యే ।
వ్యథా మశేషాం వ్యపనీయ మోద
ప్రదేన నామ్నా రమణం ప్రపద్యే ॥ 8

శ్లో॥ శివం ప్రపద్యే శివదం ప్రపద్యే
గురుం ప్రపద్యే గుణినం ప్రపద్యే ।
మదీయహృత్పద్మజుషం ప్రపద్యే
శరణ్య మీశం శరణం ప్రపద్యే ॥ 9

శ్లో॥ ప్రపత్తిం రమణ స్యైతాం తన్వతాం త్వదర్శినః ।
తత్క్రతున్యాయ రసికా స్తత్తాదృశ ఫలాప్తయే ॥ 10

# భగవాన్ ఉపదేశసారము - గణపతి ముని వ్యాఖ్యానము

- పింగళి సూర్యసుందరం

24వ శ్లోకం: ఈశజీవయో ర్వేషధీ భిదా ।

సత్స్వభావతో వస్తుకేవలం ॥

అర్థం: ఈశ్వరుడికీ, జీవునికీ భేదముందనడం ఒక భ్రమ, ఒక ఆలోచన మాత్రమే. ఉనికే రెంటికీ ఆధారం.

వ్యాఖ్యానం: భ్రమా, ఆలోచనా కలిసి ఈశ్వరునికీ, జీవికీ భేదమున్నట్లు చేస్తాయి. భ్రమ వల్ల కలిగే భేదమంటే మహత్తులో, అణువులో గల రూప భేదమేనని గ్రహించాలి. ఆలోచన వల్ల భేదమంటే సర్వజ్ఞతా, పరిమిత జ్ఞానమూ అని గ్రహించాలి. అయినా, ఉన్నదొక్కటే ఉనికి (లేక సత్) యొక్క లక్షణమే రెంటికీ ఉంది. ఉనికి (లేక సత్) అంటే గతంలో, భవితవ్యంలో, వర్తమానంలో ఉండేదని అర్థమిక్కడ.

25వ శ్లోకం: వేషహానత స్స్వాత్మదర్శనమ్ ।

ఈశదర్శనం స్వాత్మరూపతః ॥

అర్థం: వేషం ప్రక్కకు వెళ్తే, ఆత్మ దర్శనమవుతుంది. అదే భగవద్దర్శనం లేక ఈశ్వరుని దర్శనం.

వ్యాఖ్యానం: సృష్టికి మూలకారణమేదో ఉన్నదన్న భావం నశిస్తే ఆత్మ దర్శనమవుతుంది. అప్పుడు ఆత్మ స్పష్టంగా ఇంద్రియ గోచర మవుతుంది. అది సరే, కాని ఆత్మ దర్శనం భగవద్దర్శనం ఎట్లా అవుతుంది? దీనిని ఇట్లా భగవాన్ వివరించారు. భగవంతుడే ఆత్మ యొక్క రూపం. అందువల్ల ఆత్మ దర్శనమూ, భగవద్దర్శనమూ ఒక్కటే. ఇంకొక విధంగా చెప్పాలంటే, భగవద్దర్శనమంటే ఆత్మ దర్శనమే. వేషమంటూ లేదు కాబట్టి ఆత్మ అపరిమితమైనది. ఆత్మానుభూతి కూడ అపరిమితమైనదే - అన్నిటినీ కలిసి ఉంటుంది.

26వ శ్లోకం: ఆత్మ సంస్థితిః స్వాత్మ దర్శనమ్ ।
ఆత్మ నిర్ద్వయా దాత్మనిష్ఠతా ॥

అర్థం: ఆత్మలో సంస్థితమవడమంటే ఆత్మ దర్శనమే. అంటే, ద్వయీభావం లేకుండా ఉండటమే.

వ్యాఖ్యానం: క్రిందటి శ్లోకంలో దర్శనం గురించి ఉంది (దర్శన మనగానే ద్రష్ట, దృశ్యము, దర్శించటమనే కార్యము - ఈ త్రిపుటి ఉంటుంది). ఈ సందేహాన్ని ఇక్కడ రూపుమాపుతున్నారు. ఆత్మనిష్ఠలో ఉండటమే ఆత్మదర్శనం. అందువల్ల అక్కడ ఆ త్రిపుటి ఉండదు. ఆత్మకి ద్వయీభావం లేదు కాబట్టి, ఆత్మనిష్ఠునికి కూడ ద్వయీ భావ ముండదు. ద్వయీభావముదయిస్తే ఇక ఆత్మనిష్ఠ ఎట్లా సాధ్య మవుతుంది?

27వ శ్లోకం: జ్ఞాన వర్జితా ఽ జ్ఞాన హీన చిత్ ।
జ్ఞాన; మస్తికిం జ్ఞాతు మంతరం? ॥

అర్థం: తెలియటం, తెలియక పోవడమంటూ ఏమీ లేని జ్ఞానమే చైతన్యం. వేరే ఏమైనా ఉంటేనే కదా తెలిసికోవడం సంభవిస్తుంది?

వ్యాఖ్యానం: జ్ఞానమంటే తెలియడం, తెలియక పోవడం కూడా లేని శుద్ధ చైతన్య స్థితి. ఇదెట్లా సంభవం? భేద భావము లేనప్పుడు ఇంక తెలిసికోవడమెట్లా కుదురుతుంది? ఆ అబేధ స్థితినే మనం మామూలు భాషలో జ్ఞానం లేకపోవడమంటాం. కాని ఆ స్థితే సమగ్రమైనది.

28వ శ్లోకం: కింస్వరూప మిత్యాత్మ దర్శనే ।
అవ్యయా ఽ భవా ఽ ఽ పూర్ణ చిత్సుఖం ॥

అర్థం: తన రూపమేమిటని విచారించినప్పుడు, జనన మరణాలు లేని అఖండమైన ఆత్మానందం అనుభవమవుతుంది.

వ్యాఖ్యానం: తన నిజరూపమేమిటని విచారణ ద్వారా తెలుసుకుంటే అఖండమైన ఆనందప్రాప్తి కలుగుతుంది. ఇది కృత్రిమం కాదు, సహజం. ఆ ఆనందం, అవ్యయం, అవినాశి.

29వ శ్లోకం: బంధ ముక్త్యతీ తం పరం సుఖమ్ ।
విందతీహ జీవస్తు దైవికః ॥

అర్థం: వ్యక్తి ఆత్మ దివ్యమై, అన్ని బంధాలనీ అతిక్రమించి పరమానంద స్థితి చేరుతుంది.

వ్యాఖ్యానం: తాను దేహం కానన్న ఎరుకతో ఆత్మనిష్ఠుడైనవాడు దివ్యుడవుతాడు. ఆ స్థితిలోనే ఆత్మ యొక్క దివ్యత్వం ప్రకాశిస్తుంది. ఆత్మానందం కలిగినప్పుడే బంధవిముక్తులకు అతీతమవుతాడు. విముక్తి అనే భావం బంధమనే భావం పైనే ఆధారపడి ఉంది. అవిద్యా పరిధిలో ఉన్నప్పుడు ఆ స్థితిని విముక్తి అంటాం. బంధమంటూ లేని వానికి విముక్తి అనే స్థితి వేరే ఏమీ లేదు. అందువల్ల అతని స్థితి బంధముక్తు లకు అతీతమనవలసి వస్తుంది.

30వ శ్లోకం: అహమపేతకం నిజవిభానకమ్ ।
మహదిదంతపో రమణ వాగియమ్ ॥

అర్థం: మనస్సు కల్పించే 'నేను' లేని స్థితిలో కలిగే ఆత్మానుభవమే ఉత్కృష్టమైన తపస్సు. ఇది రమణుని వాక్కు.

వ్యాఖ్యానం: ఆత్మ అహమహంగా ప్రకాశిస్తుంది. అక్కడ "నేను" అనేది ఉండదు. ఆ ఆత్మానుభవమే పరమోత్కృష్టమైన తపస్సని భావం. ఇది రమణుల వాక్కు. "ఇది" అన్నప్పుడు "ఉపదేశసారము" నంతా పరిగణనలోకి తీసుకోవాలని భావం.

(భగవాన్ రమణమహర్షి బోధనకి గణపతి ముని వ్యాఖ్యానం - విభవనామ సంవత్సరం, జ్యేష్ఠ మాసం, పౌర్ణమి చంద్రగ్రహణ సమయంలో చెప్పబడినది) (సమాప్తం)

# ఆత్మ విచారణకు సుగమ మార్గం

ఆంగ్ల మూలం: నండూరి రామమోహన్

(గత సంచిక తరువాయి) తెలుగు అనువాదం: విడపనకంటి

ఇక మూలాన్ని గమనించే విషయానికి వద్దాము. కొన్ని సమయా లలో మనసును స్థిరపరచడం కష్టమైనప్పుడు, మూలాన్ని గమనిస్తూ మానసికంగా "నేను-నేను" అని పదే పదే తదేకంగా తలచుకొనడం, లేదా మరేదైన జపించడం చేస్తే సాంప్రదాయికంగా విచారణ చేసినప్పటి మాదిరి అదే లక్ష్యానికి దారితీస్తుంది. కొంతసేపటి తరువాత మనసు స్థిరపడినప్పుడు ఆ జపించడాన్ని ఆపి, ఆలోచనలకు మూలమైన (నేను-ధ్యాస) దానిపై తీవ్రంగా ధ్యాస వుంచుతూ తరువాత రాబోయే ఆలోచన కోసం వేచి చూడాలి.

మరొక ఉదాహరణ కూడ ఇవ్వవచ్చు: మన కేంద్రంలో సత్సంగానికి ముందుగా మనం సుమారు 5 నిమిషాల సేపు 'అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచలశివ, అరుణాచలా' అని పఠిస్తాము. అలాంటి పఠనం ఆత్మ-అన్వేషణ మొదలు పెట్టడానికి బాగా తోడ్పడు తుంది. కాని ఆ పదాలు ఎక్కడినుండి పుట్టుకొస్తున్నాయో గమనించడానికి వీలుగా దాన్ని నెమ్మదిగా ప్రశాంతంగా చదవాలి అని భగవాన్ సూచిస్తారు.

శ్రీ భగవాన్ పదాలు ఉదయించే క్రమాన్ని ఈ క్రింది రీతిలో విశద పరిచారు:

పర ఆత్మ → అహం వృత్తి పశ్యంతి → మాధ్యమ ఆలోచనలు → వైఖరి పదాలూ

మరొక రీతిలో చెప్పాలంటే 'అరుణాచల శివ అని కంఠం ద్వారా వెలువడే శబ్దానికంటే ముందుగా అరుణాచల శివ అన్న ఆలోచన నేను-ధ్యాస అహం వృత్తి నుండి ఏర్పడుతుంది. మనం ఆలోచనలను మూలంపై వుంచాలి గాని స్వరపేటిక నుండి వెలువడే పదాల మీద కాదు. ఇలాంటి సాధన చేస్తున్న మొదటి దశలలో మనకు ఎక్కడి నుండి ఈ ఆలోచనలు ఉదయిస్తున్నాయని తెలియకపోవచ్చు (ఆ అవసరం కూడ లేదేమో). కాని మూలాన్ని నిశితంగా గమనించే క్రియ దానంతట అదే మనసును అణిచివుంచే మార్గానికి నాటకీయంగా తోడ్పడుతుంది. ఈ మౌనమే (ఆలోచనా రహిత స్థితి) దేన్ని మనం అన్వేషిస్తున్నామో ఆ అసలైన 'నేను-ఆలోచన' లేదా 'నేను భావన', అని మరొక ఆలోచనను అందుకుంటుంది లేదా అలా చేయలేని పక్షంలో, మూలం 'ఆత్మ'లో అణుగుతుంది.

ఆలోచనలకు మూలమైన 'నేను-ఆలోచన'ను గమనించినప్పుడు ఆలోచనలు తిరోగమిస్తాయి. (వెనుకకు మళ్ళుతాయి) అంటే మళ్ళీ మూలంలో అణిగిపోతాయని భగవాన్ చెబుతారు. "ఆలోచన రూపంలో నిగూఢంగా వున్న వాసనల కారణంగా మనసు బాహ్యమైన వ్యవహారాలకు అలవాటు పడుతుంది. అంతరంలో వాసనలు వున్నంత కాలం అది మొత్తం బయటపడి ఖాళీ అయిపోవలసిందే. మనసు అంటే ఆలోచనల సమూహమే. మనసు ఏమిటని విచారిస్తే సాధకునికి అర్థమవుతుంది. ఆలోచనలు ఆత్మ నుండి ఉదయిస్తాయని, అందులో అణిగి వుంటాయని సాధకుడు గ్రహిస్తే మనసు మాయమవుతుంది. మనసు ఉనికి నశించి శాంతిపూర్వకమైన ఆనందం అనుభూతి లోనికి వస్తే మరొక ఆలోచనను వెలిదీయడానికి కష్టమవుతుంది. ఎందుకంటే అన్ని ఆలోచనలనూ రానివ్వకుండ చేయడం వ్యక్తికి కష్టమవుతుంది. (టాక్స్ 326)

మూలాన్ని నిశితంగా గమనిస్తూ, 'అరుణాచలశివ' పఠనాన్ని 5 నిమిషాల పాటు జరిపినప్పటికీ, పఠనం తరువాత మనసు మౌనం లోనికి జారుకుంటుంది. చాలా సేపటివరకు ఒక్క ఆలోచన కూడ తలెత్తకపోవచ్చు. ఆ క్షణం నుండి ఆత్మ అన్వేషణ దిశగా ప్రయత్నం చేయవచ్చు. మళ్ళీ ఆలోచన తలెత్తితే, జాగరూకతలో వుంటూ ఆలోచన యొక్క మూలాన్ని గమనించవచ్చు. లేదా ఈ ఆలోచన ఎవరికి వచ్చింది?'' అన్న ప్రశ్న వేసుకోవచ్చు. ఆత్మ అన్వేషణ సంగతి తిరిగి తరువాత పరిశీలిద్దాం.

పదాన్ని గమనించడం అంటే మూలాన్ని శ్రద్ధగా పరిశీలించడం అని అర్థం. నిశ్చలస్థితిలో వున్నప్పుడే మూలాన్ని పరిశీలించడానికి సాధ్య మవుతుంది. శ్రద్ధతో కూడిన పరిశీలన ముఖ్యమైన అంశం. మూలం అంటే ఆత్మయే పూర్ణమైన చైతన్యం. అంటే చైతన్యమే మూలానికి సంధింపబడుతుంది. దానినే భగవాన్ మనసును అంతర్ముఖం చేయడం అని వ్యవహరిస్తారు. శ్రద్ధగా గమనించక పోతే నిద్రలోనికి జారుకునే ప్రమాదం వుంది. పొందిన నిశ్చలతను ఏ విధమైన మానసిక చర్యతోగాని దృష్టి మరలించరాదు. దాని అర్థం మూలం యొక్క ఎఱుకను గుర్తెరగాలన్నది. "నిశ్చలంగా వుండు, నేను దేవుడినని గుర్తించు'' అన్న బైబిల్ లోని వాక్యం మార్గాన్ని, లక్ష్యాన్ని సూచిస్తుంది. ఆలోచనల మూలాన్ని గమనించినప్పుడు, అవి ఆత్మ నుండి ఉదయిస్తున్నాయని సాధకునికి తెలియవస్తుందని భగవాన్ అంటారు.

## 'నేనెవరు' అన్వేషణ

ఆలోచనలు ఆత్మనుండి ఉదయిస్తాయని భగవాన్ అంటారు. ఆలోచనల ఉనికి, వాటిని గురించిన భావన, పనిచేసే తీరు, వ్యక్తికి తెలియవస్తుంది. ఒక ఆలోచన తలెత్తినప్పుడు, ఆలోచన పట్ల దృష్టి, దానిని ఎఱుకపరచుకొనడం, సంబంధించిన ప్రక్రియ మనసులో

మొదలవుతుంది. ఎఱుక అన్నది చైతన్యం యొక్క స్వభావం ఆలోచనను పట్టుకుని ఉండడం వ్యక్తిగా వ్యవహరించే అహంవృత్తి యొక్క చర్య. తన స్వభావం కారణంగా అహం ఆ ఆలోచనను అందుకుని, దానినే పట్టుకుని వుంటుంది. మరొక ఆలోచన ఉదయించినప్పుడే ప్రస్తుత ఆలోచనను వదిలిపెడుతుంది. అలాగ ఒక మూలం నుండి ఆలోచనలు బయలుదేరి వస్తుంటాయి, మనసులో గుర్తింపబడుతుంటాయి. నిజానికి ఆలోచన చేసేవాడంటూ ఎవ్వడూ వుండడు. అహం ఎల్లప్పుడూ 'ఏదో ఒక ఆలోచనను పట్టుకునే వుంటుంది. మనసులో ఆలోచనాపరంపర జరుగుతూపోతున్న కారణంగా మనసును ఒక ఆలోచనల మూటగా వ్యవహరిస్తారు. ఆత్మ గుర్తింపు పట్ల శ్రద్ధ జరుగుతున్నప్పుడు మన ఉనికిని గుర్తిస్తాము, అది ఆలోచన వైపు మళ్ళినప్పుడు మన ఉనికిని గురించిన ధ్యాస అంత మవుతుంది. ఆలోచనలు మన యథార్థ స్వభావాన్ని మరుగు పరుస్తాయి.

ఒక ఆలోచన ఉదయించినప్పుడు మనం జాగరూకతతో "ఎవరి కోసం ఈ ఆలోచన?" అన్న ప్రశ్న వేసుకోవాలి. కాని దాని జవాబు కోసం మనం తొందరపడకూడదు. జవాబును దానంతట అదే స్ఫురించనివ్వండి. ఈ ప్రశ్న వేసుకున్నందువల్ల ఆలోచన నుండి మన ధ్యాస మరలుతుంది. శ్రద్ధయే చైతన్యమని మనం ముందు చెప్పుకున్నాం. ఆలోచననుండి శ్రద్ధరూపంలో చైతన్యాన్ని విడదీసి నప్పుడు, ఆ ఆలోచన నశిస్తుంది. మళ్ళీ ఆలోచన ఉదయించి చైతన్యపు దృష్టి బలవతంగా మరల్చేవరకు ముందటి ఆలోచన నశించి మనసు స్థిరమైన స్థితిలో వుండనిస్తుంది. ఒక ఆలోచన మొదలయ్యే సమయం లోనే, దానిని పూర్తి చేయనీయక వెంటనే ప్రశ్నించాలి. అందుకే ఆచరణలో "ఎవరికోసం ఈ ఆలోచన?" అన్న ప్రశ్న మనసును స్థిరంగా వుంచడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుంది. పరికించి చూస్తే

"ఎవరి కోసం ఈ ఆలోచన?" అన్న ప్రశ్న వేసుకున్న తరువాత కూడ కొన్ని సందర్భాలలో మనసు నిశ్చలం కాకుండ కొంత అటూ ఇటూ ఊగిస లాడుతుంది. సంపూర్ణ నిశ్చలత ఏర్పడదు. మన ముఖ్యమైన ఉద్దేశం ఆలోచనలు ఎక్కడి నుండి ఉదయిస్తాయో దాని వైపు ధ్యానాన్ని మళ్ళించడం. ఆ జవాబే మనసును స్థిరపరచడాన్ని పూర్తిచేసి మూలం వైపుకు ఆ ధ్యాసను మళ్ళిస్తుంది. "నాకు" అన్న జవాబు వెంటనే మూలం వైపుకు ధ్యాసను మళ్ళిస్తుంది. అప్పుడు "నేనెవరు" అన్న ప్రశ్న ఉదయించడంతో 'నేను'గా ఉండడం మొదలై "నేను" లోనే స్థిరంగా వుండడం సాగుతుంది. ఆ 'నేను' అసలైన శుద్ధ "నేను". దానికి మరి దేనితో సంబంధ, సంపర్కాలు వుండవు. సాధారణంగా సాధన చేస్తున్న మొదటి దశల్లో "నాకు" అన్న జవాబు మూలం వైపు ధ్యాస మరల్చడానికి అవసరమవుతుంది.

"అన్వేషణామార్గం (నిజానికి అది "ఎక్కడ నుండి నేను" లేదా సూక్ష్మంగా "నేను ఎవరు?" అన్న విచారణ)లో, ఆఖరుకు తెలియవచ్చే సత్యాన్ని గ్రహించడం కోసం "నేను శరీరం కాను, ఇంద్రియాలు కాను" అని ఒక్కొక్క దానిని తీసివేస్తూ పోవడం కాదు. యథార్థానికి ఆ మార్గంలో అహంవృత్తికి మనలో ఎక్కడి నుండి 'నేను' ఆలోచన వస్తున్న దన్న విషయాన్ని కనుగొనే ప్రయత్నం చేస్తున్నాము" అని భగవాన్ అంటారు. విపులంగా కాకపోయినా, దృఢంగా ఆ శ్వాసను గమనించా లన్న సూచన ఆ మార్గంలో ఇమిడి వుంది. అన్ని ఆలోచనలకు మూలమైన 'నేను-ఆలోచన' ఎక్కడి నుండి ఉదయిస్తున్నదని గమనించినప్పుడు మనం శ్వాస యొక్క మూలాన్ని కూడ గమనించడం జరుగుతుంది. ఎందుకంటే 'నేను-ఆలోచన', శ్వాస, ఒకే మూలం నుండి బయలుదేరు తాయి" అని భగవాన్ అంటారు. (డే బైడే 1/12/45) మూలాన్ని గురించి ఎఱుక అస్పష్టంగా, సందిగ్ధంగా వున్న సందర్భాలలో కూడ అహం నాశనానికి అది దోహద పడుతుంది. (టాక్స్ 80)

# శ్రీ భగవాన్ పాద సన్నిధిలో (At the feet of Bhagavan)

ఆంగ్లమూలం: టి.కె. సుందరేశ అయ్యర్
(గత సంచిక తరువాయి) తెలుగు అనువాదం: జి. శ్రీహరిరావు

మనస్సు మొత్తము నూటికి నూరు శాతము సాత్విక భావముతో నిండిపోవలెను. ఈ స్థితి లభ్యమైనప్పుడు మనస్సును సత్-చిత్-ఆనందమును అనుభవైక్యము చేసుకొనుటకు వలసిన విజ్ఞాన లబ్ధికి వినియోగించు కొనవచ్చును.

ఈ విజ్ఞత దేహాత్మ భావమును పోగొట్టుకొని అంతర్ముఖత్వమును పెంచుకొనడము వలన లభ్యమవుతుంది. పూర్వ వాసనలు, ఆలోచనలకు దూరమై ఆత్మ విచారణకు, ఆత్మానుభవమునకు చేసుకో వలసిన సాధన యిదే. ఆత్మస్పర్శ కొరకు నిరంతరము చేసుకొను యీ ప్రయత్నము వల్ల పరిపూర్ణ జ్ఞానముతోబాటు శాశ్వతము, సత్యము అయిన ఆత్మసుస్థితి లభించును.

వాస్తవానికి, నీవు స్వతంత్రుడవు. నిన్నెటువంటి మబ్బులూ కప్పి వేయలేవు. కాని నీ పూర్వ కర్మ ఫలితము వల్లను ఆ కర్మ ప్రేరిత వాసనల వల్లను, నీ బాహ్య చేష్టలు నిర్దేశింప బడతాయి. కుమ్మరి చక్రము మీద నుండి చేయి తీసివేసిననూ, మునుపటి శక్తి వలన చక్రము తిరుగుతూనే వుండును.

ఇదే విధంగా నీ చేష్టలు నిన్ను స్పర్శించ లేవు. నీవు కర్త వయినను నిన్ను కర్తృత్వ భావము స్పృశించదు. సుఖ దుఃఖాలు అనుభవించుచునే నీవు వాటికి అతీతుడవు అవుతావు. జాగ్రత్, స్వప్న, సుషుప్త్యావస్థలలో నీవు కేవలము సాక్షీమాత్రుడవుగా నిలుస్తావు. నీవు నీవే, నేను నేనే,

ఆత్మ ఆత్మయే. ఈ పరిస్థితులన్నియూ వచ్చి పోతుంటవి. ఆ స్థాయిని చేరుకొనుటయే నిజమయిన జ్ఞానము, నిజమయిన భక్తి, లభ్యము చేసుకోవడము. గీతా సారంశమిదే. మన సద్గురువు భగవాన్ శ్రీరమణ మహర్షి బోధించినదియునూ యిదియే.

దీనిని గ్రహించి, మనము ధైర్యము చిక్కబట్టుకొని ముందుకు సాగవలెను. అహంకారప్రేరిత చేష్టలన్ని అధిగమించి అంతులేని యీ చావు పుట్టుకలకు అతీతులమై ఆత్మ సుస్థితులగుట కొరకు, శ్రీ గురుదేవుల దీవెనలు మనకు లభ్యమగుగాక.

'స్వాతంత్ర్యము నా జన్మ హక్కు. అది నేను పొందితీరుతాను'' అని శ్రీ లోకమాన్య బాలగంగాధర తిలక్ ఉద్ఘాటించిరి. ''సంపూర్ణ జ్ఞానము నీ జన్మ హక్కు అది నీకు దక్కి తీరుతుంది'' అని మన గురుదేవులు ఉద్ఘాటించిరి.

**జ్ఞాని - ఇంద్రజాలికుడు**

శ్రీ భగవాన్ సందర్శనార్థము వచ్చు పలువురు భక్తులు వారితో ఆధ్యాత్మిక రంగములోని వివిధ విషయముల గురించియు, సిద్ధుల గురించియు చర్చించెడివారు. అనేక కఠోర తపస్సులు, తీవ్ర సాధనలు చేసి యీ మానవ జన్మ సంపాదించిన మనమందరము సిద్ధులమే అనెడివారు శ్రీ భగవాన్. ఈ మానవ జన్మ లభ్యము చేసుకొన్న మనకున్న ఏకైక గమ్యము ఆ సత్-చిత్-ఆనందమును సాధించుటయే. కానీ మనం ఈ దేహమును సిద్ధులు సంపాదించుటకే వినియోగించుకున్న యెడల ఇనప సంకెళ్ళు వదిలి, బంగారు సంకెళ్ళు తగిలించుకున్నట్లే యగును. సంకెళ్ళు సంకెళ్ళే. వాటిని వదిలించుకోవలెనన్న వాటి

నిర్మూలన చేయగల మహాపురుషులు ఆత్మసాక్షాత్కారము పొందిన వారల సహాయము పొందవలెను.

ఒక జ్ఞాని దృష్టిలో, యీ సిద్ధులు స్వప్నానుభవముల కంటే భిన్నములు కావు. ఒక బిచ్చగానికి తానొక రాజ్యాధిపతి అయినట్లు కల వచ్చెననుకొనుడు. కల వున్నంతవరకూ రాజభోగములు అనుభవిస్తూ వుండెదరు. కల కరిగిపోగానే, తన భిక్షాపాత్ర తీసుకొని బయలుదేరవలసినదే. ఆకలి తీర్చుకొనుటకు అడుక్కొనడం తప్పదు. ఈ సిద్ధ శక్తులు కూడా అట్టివే! వాటి ప్రభావము వాసనలున్నంత వరకే. అవి మాయమవ్వగానే, ఈ శక్తులన్నీ సత్యదూరములని విశదమవుతుంది.

ఈ నిజమును తెలుపుటకు శ్రీ భగవాన్ గొప్ప సిద్ధుడైన గోరఖ్‌నాథ్ జీవితము గురించి 'ప్రభులింగ లీల'లో చెప్పబడినట్లు వివరించెడి వారు. అనేక కఠోర సాధనలొనర్చి గోరఖ్‌నాథ్ తన దేహము, వేయి సంవత్సరములయినను వినాశము కాకుండునట్లు శక్తిని సంపాదించు కున్నారు. దేహమును అనేక రకముల పరీక్షలకు గురిచేసి, అన్నిటనూ విజయము సాధించిరి. దానితో ఆయన తబ్బిబ్బై, ఎందరో యోగులను, మహాత్ములను, పిలిచి తన దేహమును పరీక్ష చేయమని కోరెడివారు. కత్తితో నరకమని ఆహ్వానించెడివారు. వారెంత ప్రయత్నించిననూ, కత్తి తాకిడికి దేహమునుండి ఖంగుమని శబ్దము వెడలుచుండెను గాని, సిద్ధునికి యిసుమంత గాయము కూడా కలిగెడిది కాదు. గుడిగంటలు మోగినప్పుడు వచ్చు ఘంటారావమువలె ఆ శబ్దము కొన్ని నిముషముల వరకూ మారుమోగెడిది. మరణమును జయించితినని

ఆయన గర్వముతో విఱ్ఱవీగుచుండెడివారు కాని, ఏదో ఒక రోజు యీ దేహమును వదిలివేయవలసి వచ్చునని గ్రహింపలేకపోయిరి.

తాము కల్పించుకున్న యీ మిథ్యా ప్రపంచములో సంతసమున మునిగి తేలుతున్న గోరఖ్‌నాథ్‌కు, అల్లమ ప్రభువు అను మహాజ్ఞాని గురించి తెలిసినది. ప్రజలు తండోపతండములుగా వారిని దర్శించి, వారి పాదముల వద్ద కూర్చొని, ఆ సందర్శన భాగ్యమును అనుభవిస్తూ, అల్లమ ప్రభువు ప్రవచనామృతమును గ్రోలుచుండిరని గోరఖ్‌నాథ్ తెలుసుకొనిరి. ఆ జ్ఞాని మానవజాతిని ఉద్ధరించు నిమిత్తము దేహధారిగా విచ్చేసిన సాక్షాత్తూ ఆ సాంబశివుడే అని వేరుగా చెప్పనవసరము లేదు. తనను దర్శించుకొనుటకు వచ్చిన భక్తులందరకూ అల్లమ ప్రభువు దేహముతో అనుభవించు విషయము లన్నియు వాస్తవములు కావని వివరించెడివారు. మనిషికి, మనిషికి మనము కల్పించుకొనిన భేదము సత్యదూరమనియు, ఆత్మ సాక్షాత్కారము పొందిన గాని, మనకు నిజమయిన వెలుగు కానరాదనియూ బోధించెడివారు. జాగ్రత్-స్వప్న, సుషుప్తావస్థలన్నిటినీ అధిగమించి, మనోవికారములనన్నిటిని-సంతోషదాయకములుగానీ, దుఃఖ హేతువులుగాని, - జయించి శాశ్వతమయిన తురీయావస్థను చేరుకుని హృదయాకాశములో రమించినప్పుడు మాత్రమే నిజమయిన శాంతి లభించునని వారి వివరణ.

ఆ స్థితిని చేరుకున్నప్పుడు ద్వంద్వములన్నియు అదృశ్యమై అభిన్న స్థితి ప్రాప్తించును. క్లుప్తముగా చెప్పవలెనన్న వారి బోధన సారాంశము ఒక్కటే - నీవే మూల సత్యము, నీవే సర్వసాక్షివి. నీవు తప్ప వేరొకటి లేదు. నిన్ను విడిచి బాహ్య ప్రపంచమన్నది లేదు. సత్-చిత్- ఆనంద

మంతయూ నీవే. ఆ స్థితి చేరుకొనుటయే బ్రహ్మానందమును అనుభవించుట.

మన 'సిద్ధ పురుషుడు' గోరఖ్‌నాథ్ - యీ జ్ఞాని విషయమేమిటో తెలుసుకునెదమనీ, వీలైనచో వారినీ వారి బోధననూ ఖండించి తన గొప్పదనమును నిరూపించుకొనవలెనని, అల్లమ ప్రభువు వద్దకు పయనమయ్యెను. అల్లమ ప్రభువును చూసి గోరఖ్‌నాథ్ ఆశ్చర్య చకితుడాయెను. మహాజ్ఞానిగా పేరొందిన ఆయన బక్కచిక్కిపోయి ఒక ఎముకల గూడువలె పొడగట్టెను. వారిని సమీపించి, ఎగతాళిగా యిట్లు సంబోధించెను:

''మరణమును జయించిన మహాజ్ఞానిగా మిమ్ములను పొగడుచుంటిరే! ఇంత బలహీనమైన దేహమా మీది. ఇట్టి శరీరముతో మీరు మరణమును జయించగలరా? నన్ను చూడండి. నాకున్న యీ శరీరము వల్ల చావు నా దరిదాపులకు రాదు. ఈ కత్తి నాపై ప్రయోగించుడు. నేను సాధించిన ఘనత మీకు తెలియ వచ్చును''.

అల్లమప్రభువు, ఆ సాహస కార్యము వలదని నచ్చజెప్ప బోయెను. గోరఖ్‌నాథ్ విననందువలన, కత్తిని ఆయన దేహముపై ప్రయోగించిరి. ఎప్పటివలెనే ఖంగుమను శబ్దము వెడలినే గాని, ఆయనకెట్టి గాయమూ కలుగలేదు. అల్లమప్రభు యెంతో వినయముతో, సంభ్రమముతో గోరఖ్‌నాథ్ సాధించిన దైహిక దారుఢ్యమును మెచ్చు కొనిరి. ''మీరు సాధించిన శక్తి అద్భుతము. మీకు నా జోహార్లు. మీరు చెప్పిన విధముగా నేను చేసితిని గావున నా ప్రార్థన కూడా మీరు మన్నించవలెను. ఈ కత్తితో నన్ను నరికి వేయుడు'' అని కోరిరి.

గోరఖ్‌నాథుడాపని చేయుటకు భయపడిరి. అల్లమ ప్రభు మృతి చెందునని వెనుకాడిరి. ''నేను చనిపోయిననూ ఫరవాలేదు. అట్లయిననూ ఆ బాధ్యతను మీ మీద మోపను నేను'' అని అల్లమ ప్రభువు ధైర్యము చెప్పిరి. అటులనే గోరఖ్‌నాథ్ కత్తి తీసుకొని అల్లమ ప్రభువు శరీరముపై వేటు వేసిరి. ఆశ్చర్యము ఆ కత్తి ఆయన దేహము లోనికి చొచ్చుకు పోయెను కానీ, ఆయనకెట్టి గాయమూ కలుగలేదు. కత్తిని ఎడమనుండీ కుడికీ, కుడి నుండి యెడమకూ, ముందు నుండి వెనుకకూ, వెనుక నుండి ముందుకూ - అన్ని దిశలలో ఆయనను కత్తితో పొడిచిరి కానీ, అది ఆయనపై యెట్టి ప్రభావమూ చూపలేదు. ఆ కత్తిని ఒక శూన్య ప్రదేశములో గాలిలో తిప్పినట్లాయెను.

గోరఖ్‌నాథ్‌కు యిది పెద్ద తలవంపుగా పరిణమించెను. అల్లమ ప్రభువుతో యిట్లనిరి:

''ఇన్నాళ్ళు ప్రయత్నించి నేను సాధించినదేమిటి? నేను కేవలము కుండను కాల్చితిని. మీరు నిజముగా అమృతత్వమును సంపాదించి మృత్యువును జయించితిరి. దయచేసి నన్ను మీ శిష్యునిగా స్వీకరించి నాకు ఆత్మతత్వము బోధించుడు మహాత్మా'' అని ప్రార్థించి, వారి పాదముల నాశ్రయించిరి. అల్లమ ప్రభువు గోరఖ్‌నాథ్‌ను శిష్యునిగా స్వీకరించి, జ్ఞానమునకు, అజ్ఞానమునకు అతీతమయిన బోధను చేసిరి.

శ్రీ భగవాన్ చేరుకున్న విశేషమయిన, అజేయమయిన స్థితికి యీ కథ ఒక ఉదాహరణ. సత్యాన్వేషణలో నిమగ్నులయిన అందరూ ఈ కథ వల్ల ఆ తురీయావస్థ గురించి తెలుసుకొనగలరు. (సశేషం)

# సిద్ధులు, వారి "సిద్ధు"లు

('మౌంటెన్‌పాత్', ఏప్రిల్-జూన్ 2015, (52 సంపుటి, 2 సంచిక)లో 'కీ వర్డ్' శీర్షికతో ప్రచురింపబడిన వ్యాసం 'సిద్ధ-సిద్ధి' నుండి ఎన్నుకొనబడిన భాగాల యొక్క అనువాదం) ఆంగ్లమూలం: డా॥ జాన్ గ్రైమ్స్

(గత సంచిక తరువాయి) **తెలుగు అనువాదం: డా. వి. రామదాస్ మూర్తి**

సిద్ధులు కోకొల్లలు. ఎన్నో సందర్భాలలో భగవాన్ అరుణాచలం గుహలలో సిద్ధులు ఆవాసం ఏర్పరచుకుని వున్నారని చెప్పేవారు. కొందరు "సిద్ధు"లను కలిగి వాటి ప్రయోగం కూడ చేసివుండవచ్చు. మరికొందరు 'సిద్ధు'లను పొందివుండకపోవచ్చు. ప్రస్తుతం కూడ సహజాతీత శక్తులను కలిగిన సిద్ధులు ఆ గుహల్లో వున్నారు. వారు భౌతిక శరీరంతో వుండవచ్చు, లేకపోవచ్చు. రాత్రిళ్ళు వెలుగు రూపంలో సంచరిస్తారని చెబుతారు" అన్నారు.

పలు సందర్భాలలో భగవాన్ రమణ జంతువుల రూపంలో సిద్ధులు తమ దర్శనానికి వచ్చినట్లు చెప్పారు. బంగారు వర్ణంతో వున్న ఒక ముంగిస గురించి పేర్కొనేవారు. "అది ఆ రూపంలో వున్న సిద్ధ పురుషుడు కావచ్చు" అన్నారు కూడ. "సిద్ధపురుషులు వేర్వేరు రూపా లను పొందివుంటారని అంటారు, నిజమా?" అని ఒకరు అడిగిన ప్రశ్నకు, "అది నిజమే" అని జవాబిచ్చారు.

సిద్ధపురుషులు, జ్ఞాని, "సిద్ధు"లను ప్రదర్శించగలరా? జ్ఞానికి సంబంధించి కొన్ని అద్భుత సంఘటనలు జరగడం అనుభవంలో వున్న విషయమే. కొన్ని సందర్భాలలో అలాంటివి శ్రీరమణుల విషయంలో కూడ జరిగాయి. జ్ఞానికి మనసు వుండదని మహర్షి అన్నారు. అతనికి ఇష్టం, కోరిక, దేనినో ఎన్నుకోవడం ఇలాంటివి వుండవు. అతను పని గట్టుకుని ఏ కార్యమూ చేయడు. అలాంటి పరిస్థితుల్లో ఎవరు ఎవరికి

ఏమి చేయాలి? ఆత్మ, చైతన్యం తప్ప నిజంగా యితరమైనది ఏదీ వుండదు.

చాలా ఏళ్ళ క్రితం నేను (ఈ వ్యాస రచయిత శ్రీ జాన్‌గ్రైమ్స్) మైలాపూరు (చెన్నై)లోని కపాలేశ్వర ఆలయం దాపున వున్న ఒక కోనేటి దగ్గర నివసిస్తూ వుండిన స్వామి సుందరంను కలిశాను. దక్షిణ భారత మంతట ఆయన గురూజీగా పేరు పొందారు. చెన్నై పరిసరాల్లో ఒక చిన్న ఆశ్రమం కూడ వుండేది.

ఒక సందర్భంలో గురూజీ యిలా అన్నారు: "సిద్ధ"లు మన వృత్తి ద్వారా మనం సంపాదించుకునే ధనం లాంటివి. మీరు పని చేస్తారు, సంపాదిస్తారు, ఆ డబ్బును పర్సులో వుంచి మీ జేబులో పెట్టుకుంటారు. డబ్బు అవసరమైనప్పుడు బైటకు తీసి వాడుకుంటారు. మళ్ళీ జేబులో పెట్టుకుంటారు. కొందరు తమ తపస్సుతో అద్భుత శక్తులను పొందుతారు. మరి కొందరు 'సంయమం' (ధారణ, తీవ్రమైన ఏకాగ్రత, ధ్యానం, సమాధి)తో వాటిని సంపాదిస్తారు. మరికొందరు కొన్ని మందులు/మూలికల వాడకం ద్వారా పొందితే యింకా కొందరు గురువు యొక్క ప్రసాదంగా లేదా దైవకృపతో అలాంటి శక్తులను ప్రదర్శించగలుగుతారు. ఇక ప్రాణాయామం ఫలితంగా లేదా అయాచితంగా, అసంకల్పితంగా అప్పటికప్పుడు అతీత శక్తి సంపాదన చేయగలగవచ్చు".

"గురువు పోస్టు డబ్బా లాంటి వారు. జనం పోస్టు డబ్బాలో ఉత్తరాలను వేస్తుంటారు. తపాలా కార్యకర్తలు ఉత్తరాలను వాటి వాటి గమ్యస్థానాలకు చేర్చినట్లు స్వామీజీ కూడ వ్యవహరిస్తారు. అన్ని రకాలైన అద్భుతాలు, అతీత శక్తులకు మూలం ఎప్పుడూ దైవమే గాని వార్తాహరుడు కాదు".

జ్ఞాని జరిపే అన్ని చర్యలు ఆత్మ యొక్క శక్తి ద్వారా జరుగుతుంటాయి. సాధారణ ప్రజలు జ్ఞానియే ఆ కలాపాలను జరుపుతున్నట్లు భావిస్తారు. అద్భుత కార్యాలతో సహా ఏ కార్యాచరణ గాని, ఒక సంకల్పం, నిశ్చయం, మనసు ప్రమేయం లేకుండ ఎలా జరగగలదని జనానికి అంతుపట్టని విషయం.

భగవాన్ జీవితకాలములో కూడ కొన్ని అద్భుత సంఘటనలు జరిగాయి. ఎంతోమంది భక్తులు తమ అద్భుత, అతీత సంఘటనలు తమ పరిసరాలలోనే ఎఱుకలోనికి వచ్చినట్లు చెప్పారు. భగవాన్ అలాంటి సందర్భాలలో అవి తాము చేయలేదని, అప్రయత్నపూర్వకంగా, అయాచితంగా అప్పటికప్పుడు జరిగిపోయాయని జవాబిచ్చేవారు. అలాంటి అద్భుతాలకు తాము కారకులమని మహర్షి ఎప్పుడూ చెప్పుకోలేదు. ''సిద్ధు''లను గురించిన ఏ మాత్రపు ఆసక్తి చూపలేదు. అవి అసలు ఏ విలువలేనివని తఱచు చెప్పేవారు. ఒకసారి అలాంటి సంఘటన గురించి ఎవరో చెబితే ''సిద్ధులు'' అలా చేస్తారు కాబోలు అని ఊరుకున్నారు. మరొక సందర్భంలో భగవాన్ ''జ్ఞానుల్లో సిద్ధులు, శుద్ధులు అని రెండు తెగలుంటారు'' అని వ్యాఖ్యానించారు. ''తమకు సహజాతీత శక్తులుంటాయని సిద్ధులకు తెలుసు. శుద్ధులకు కూడ అలాంటి శక్తులుంటాయి. కాని వారికి ఆ విషయం తెలియను కూడ తెలియదు'' అన్నారు.

* * *

# Sri Krishna-avatar

Dr. K.Subrahmanian (Talk No.40)

(This speech was delivered on a Janmashtami day)

Krishna is considered as a *Purna-avatar*, the perfect descent of Divinity. When you read the Bhagavata, you find that everything about Sri Krishna is so sweet - Krishna as a baby, as a boy, as a young man, Krishna as a lover, Krishna as a husband, as a friend, as a soldier, as a king, as a philosopher, Krishna as a lover of nature, of animals and birds and everything in this universe, Krishna as a flutist and what is more, Krishna as a *sthitapragnya*, as a supreme jnani. Every aspect of Krishna is so beautiful. Suka asks, is there anything at all about Krishna that is not beautiful?

**अधरं मधुरं वदनं मधुरं नयनं मधुरम् हसितं मधुरम् ।**
**हृदयं मधुरं गमनं मधुरं मधुराथिपतेरखिलं मधुरम् ॥**

*Adharam madhuram..vadanam Madhuram,*
*nayanam madhuram hasitam madhuram,*
*hridayam madhuram gamanam madhuram*
*madhuraadhipateAkhilam madhuram.*

Madhuradhipate, you are the Lord of all sweetness! No avatar has been described in so many aspects as so beautiful.

His attitude to Kuchela, Bhishma, Arjuna, Draupadi, Rukmani, Uddhava, towards everyone around him, was very profound; it was filled with extraordinary compassion.

**अनन्याश्चिंतयन्तो मां ये जनाः पर्युपासते ।**
**तेषां नित्याभियुक्तानां योगक्षेमं वहाम्यहम् ॥**

*Ananyaaschintayanto maam ye janaah paryupaasate,*
*teshaam nithyaabhiyuktaanam yogahkshemam vahaamyaham.*

He has said, “Those who think of me and me alone, those who depend on me totally - I look after all their day to day

needs”. Real sadhus and saints think about the Lord and talk about Him all the time. Because they don’t think of anything else, we feel it is our responsibility to sustain them in whatever small measures we can. The Lord makes us feel, here is a person who has totally surrendered to Him, he will not ask for anything, and it is our duty to do what we can.

Buddha says, health is the greatest gain; contentment is the greatest happiness; faith is one’s greatest friend and renunciation is the greatest goal. If you are healthy you must consider yourself extremely lucky and if you are contented, you will be supremely happy. You are happier than a king because he is not happy with what he has but wants more. If you have faith, you are able to see things with a telescopic vision, much more than what you can see with your reason. So, faith is the greatest friend, and lastly, Nirvana (to be free from attachment) is the greatest goal, says Buddha. Nirvana means that you are not seeking anything; if things come to you, you accept them, if things leave you, you are not sorry. Krishna has also said something similar in Bhagavad Gita.

**दुःखेषु अनुद्विग्न मनाः सुखेषु विगत स्पृहः ।**

*Dukheshu anudvigna manah, sukheshu vigatah spruhah*

(Gita, Ch :2)

A jnani, a sthitapragnya, is one who is not affected by whatever happens. He is free from desires of any kind, fear and anger. As far as we are concerned, when there are obstacles on the way, we get upset ; we lose our sense of proportion, our balance and we ruin our lives. So Krishna says, when you work you are rewarded sometimes and sometimes you are not. Whether you succeed or fail, the fruits are given by the Lord. Krishna says accept both success and failure alike. This is the central theme of Bhagavad Gita. If you do the work to the best of your ability, whatever the result, you will have peace of mind.

